# వెలుగు

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు

'ఫాదర్ ఎక్స్‌పైర్డ్, స్టార్ట్ ఇమ్మీడియెట్లీ'

టెలిగ్రాం అందుకున్న రాఘవ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తనని అరచేతుల్లో పెంచిన తన తండ్రి అక్కడ ఊళ్లో అచేతనంగా ఉన్నాడని తెలుసుకున్నాక హృదయం ద్రవించిపోయింది. జీవితంలో గెలుపు ఓటములు సహజమనీ, ఓడినప్పుడే గెలుపుని మరింత పట్టుదలతో సాధించాలని అనునయంగా చెప్పారు. ఫలితంగా ఇప్పుడు ఉన్నతమైన చదువుతో ఉత్తమమైన స్థానంలో ఉన్నాడు. అయినా ఉపయోగమేమిటి? తండ్రిని సమాదరించలేకపోయాడు. సజలాలయిన అతని కళ్లు అవిశ్రాంతంగా కన్నీళ్లని స్రవించసాగాయి.



రిటైరైన తర్వాత గంపెడాశతో తన ఇంటికి వచ్చారు తల్లీతండ్రి. కొన్నాళ్ల వరకు బాగానే ఉంది. ఆ తర్వాతే వాళ్లు తన ఇంట్లో ఇమడలేకపోయారు. వాళ్లిద్దరూ మానసికంగా కృంగిపోయి ఒకనాడు "ఒరేయ్ మేము ఊరెళ్దామనుకుంటున్నాం" అన్నారు.

వారించడం మాట అటుంచి కనీసం వాళ్లవంక చూడకుండా తలొంచుకుని బయటకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వాళ్ల మధ్య అగాధం చోటుచేసుకుంది. ఉత్తరప్రత్యుత్తరాల్లేవు. 'తండ్రి మరణించాడు. అచేతనంగా ఉన్న ఆయన పక్కన తన తల్లి శోకదేవతలా ఉందేమో. ఓదార్చడానికి, సహాయం చేయడానికి ఎవరన్నా ఉన్నారో లేదో? ఎందుకుంటారు? కన్నకొడుకైన తనే వాళ్లని దూరంగా ఉంచాడు. ఎవ్వరైనా ఎందుకు ఆదరిస్తారు? లేదు ఇప్పటిదాకా అయింది చాలు. కనీసం కర్మకాండ అయినా శాస్త్రోక్తంగా జరిపించి పై లోకంలోనైనా ఆయన మనశ్శాంతిని పొందేలా చేయాలి. పితృరుణం తీర్చుకోవాలి' అనుకుని

"లక్ష్మీ! మా నాన్నగారు పోయార్ట. మనం వెంటనే వెళ్లాలి. నువ్వు సామాన్లు సర్దు. నేను టికెట్లు తీసుకువస్తాను" అని పరుగులాంటి నడకతో మరోమాటకు అవకాశమివ్వకుండా బైటకి వెళ్లిపోయాడు.

★ ★ ★

కొడుకు ఇంటి నుండి వచ్చిన పూర్ణానందంగారు బోసిగా ఉన్న ఇంటిని చూసేసరికి దుఃఖం తన్నుకొచ్చింది. ఈ ఇంట్లోనే వాడు పుట్టాడు. పెరిగాడు. ప్రయోజకుడయ్యాడు. ఇప్పుడు తాము లేకపోయినా బ్రతగ్గలడు అన్న నమ్మకం ఏర్పడ్డాక దూరమైపోయాడు. తనే బాధపడితే నవమాసాలు మోసి రక్తం పంచి ప్రేగు తెంపుకుని జన్మనిచ్చిన ఆ తల్లిని ఎవరు ఓదార్చుతారు? అందుకే ఆయన ఆవిడ వంక నవ్వుతూ చూసి "పార్వతీ! ఇహ నుంచి నాకు నువ్వు నీకు నేను. బాధపడి మానసిక ప్రశాంతతని దూరం చేసుకోవద్దు సరేనా?" అన్నాడు. ఆవిడ భర్త మాటకి ఎదురు చెప్పి ఎరగదు. 'సరే' అన్నట్టుగా తలాడించి కన్నీళ్లు తుడుచుకుంది.

"ఇక నుండి ఏదైనా వ్యాపకం పెట్టుకోవాలి. మనసును ఖాళీగా ఉంచితే అది పిచ్చిపిచ్చిగా ఆలోచించి మతిస్థిమితం కోల్పోయేలా చేస్తుంది అనుకుని ఆ రోజు నుండి సరికొత్త జీవిత విధానానికి నాంది పలికారు. పెరట్లో రకరకాల పూల, పళ్ల మొక్కలు నాటారు. కాయగూరలు పండించి అందరికీ ఇవ్వడం. ఎవరికి ఏ కష్టమొచ్చినా పరామర్శించి సహాయం చేయడం, పొద్దున్నే లేచి మార్నింగ్ వాక్‌కి వెళ్లడం. ట్యూషన్ చెప్పించుకునే స్థోమతు లేని పేద పిల్లలకి ట్యూషన్ చెప్పడం, యువతకి వ్యక్తిత్వ వికాస శిక్షణనివ్వడం ఇలా ఒకటేమిటి? ఎన్నో మొదలెట్టి విజయవంతంగా నడిపించసాగారు. వాళ్లలో వచ్చిన మార్పు ఊరంతటినీ మార్చింది. ప్రతిఫలాపేక్షతో కాకుండా ప్రత్యేక శ్రద్ధతో ఆయన తమ పిల్లల జీవితాలని మారుస్తుంటే ఊరి వాళ్లందరికి ఆదర్శప్రాయుడయ్యాడు. ఆప్తబంధువయ్యాడు.

ఇవేమీ ఆయన కొడుక్కి చెప్పలేదు. తెలియజేసే సందర్భం, అవకాశం రాలేదు.

★★★

కట్టెలా మారిన తన తండ్రి శవాన్ని చూసి ఎలా తట్టుకోవాలో, శోకతప్త హృదయంతో ఉండే తల్లిని ఎలా ఓదార్చాలో అనుకుంటూ ఇంటిముందు రిక్షా దిగిన రాఘవ అక్కడి వాతావరణాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. పిల్లలు, యువతీయువకులు, పెద్దలు అందరూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. రాఘవ వెళ్లి తండ్రిపాదాల వద్ద దుఃఖంతో కూలబడ్డాడు. అందరికీ అర్థమైంది పూర్ణానందంగారి కొడుకు వచ్చాడని.

శవయాత్ర పెద్దఎత్తున జరిగింది. ఊరివాళ్లందరూ చనిపోయిన తన తండ్రికి అన్ని గౌరవ మర్యాదలు చేస్తుంటే బ్రతికుండగా ఆయనకి తనేం చేయలేకపోయినందుకు కుమిలిపోతున్నాడు.

పెద్దకర్మ ఊళ్లో ఒక వేడుకలా జరిగింది.

రాఘవ తల్లి దగ్గరకెళ్లి "అమ్మా! నాన్న లేని ఈ ఇంట్లో నువ్వు ఒంటరిగా ఎలా ఉంటావు? మాతో పాటు వచ్చేస్తే అందరం కలిసి ఉండవచ్చు ఏమంటావు?" అన్నాడు.

అక్కడున్న వాళ్లందరూ ఆవిడ వంక ఆదుర్దాగా చూశారు ఏమంటుందో అన్నట్టుగా.

ఆవిడ అక్కడున్న పిల్లల్ని దగ్గరకి తీసుకుని "చూడు బాబు! అందరం మనం మన పిల్లలు అంటూ స్వార్థంగా జీవిస్తాం. మీ నాన్నగారు దైవత్వానికి ప్రతిరూపం. నీ ఇంటి నుండి తిరిగొచ్చాక మా స్వార్థం విరిగిపోయింది. మీ నాన్నగారు నీకు విద్యాబుద్ధులు చెప్పినట్టే, ఇక్కడున్న అందరికీ చెప్పారు. మీ నాన్నగారిలాగానే నేను కూడా నా చివరిశ్వాస వరకూ వీళ్ళ బాగుకోసం శ్రమిస్తాను. మేమేదో సంఘ సేవకులమని, సమాజశ్రేయస్సు కోసం పాటుపడుతున్నామని చెప్పడం లేదు. వృద్ధాప్యంలో ఆదుకుంటారన్న ఆశతో పిల్లలకి ఎంతో చేస్తాం. కానీ వాళ్లు 'ఛీ' కొడితే కుమిలిపోతాం. అదే మన పిల్లలతో పాటు మరి కొంతమందికి సహాయం చేస్తే ఎవరో ఒకరు మానవతావాదిగా ఎదిగి తలకొరివి పెట్టే తీరిక చేసుకోవచ్చు. నాన్నగారు నీ ఒక్కడినే చదివించి గాల్లో దీపాన్ని చేశారు. ఆ తర్వాత పశ్చాత్తాపంతో వీళ్లందరికీ జ్ఞానభిక్ష పెట్టారు. ఈ దేదీప్యమానమైన వెలుగులో అత్యంత సంతృప్తితో కన్నుమూశారు. ఆ తృప్తితోనే నేను రేపు వెళ్లిపోతాను.

చివరిగా నీకో సలహా. రేపు నీ దార్లన్నీ మూసుకుపోయిన దశలో కృంగిపోకుండా ఇక్కడికి రా. ఆయన వారసుడిగా వీళ్లకి నీకు తోచింది చేయి" అని లోపలికి వెళ్లిపోయింది.

తల్లి హితబోధతో రాఘవ మనసులో పేరుకుపోయిన స్వార్థపు పొరలు ఒక్కొక్కటిగా కరిగిపోసాగాయి.

★